


# మనం
## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

సోమవారం | 4 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 7




## కాంగ్రెస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

**పోరాటం ప్రజలది..బాగుపడ్డది కేసీఆర్ కుటుంబం**

**తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌నే మోసం చేసిన కేసీఆర్**

**గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలి**

**కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్**

హుస్నాబాద్,సెప్టెంబర్ 3,(మనం న్యూస్)ః కాంగ్రెస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కరీంనగర్ మాజీ ఎంపీ, బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. అక్కనపేట మండలంలోని చౌటపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ గ్రామానికి కాంగ్రెస్ కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిలు పాల్గోన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పొన్నం మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రజలు పోరాటం చేస్తే బాగుపడ్డది మాత్రం ఒక్క కేసీఆర్ కుటుంబమే అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌నే కేసీఆర్ మోసం చేసారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిందని ఆయన గుర్తు చేసారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ కోసం కోట్లాడి తెచ్చుకుంటే ఇప్పటికి ప్రజల జీవితాలు మారలేదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ఆర్ తో శంకుస్థాపన చేసాడని ఆయన గుర్తు చేసారు. కుర్చీ వేసుకుని మిగతా 2లో..

**శ్రీశైల దేవస్థానంలో సిద్దిపేట నృత్య కళాకారుల ప్రదర్శన**

**అభినందించిన ప్రముఖులు**



2 లో

## ఓటరు నమోదు సవరణ ప్రక్రియలు
# వేగవంతం చేయాలి

**దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచరాదు**

**కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలి**

**మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

పాపన్నపేట/మెదక్, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా మెదక్ జిల్లా అధికార యంత్రాంగం, సిబ్బంది ఓటరు నమోదు ప్రక్రియ, సవరణ ప్రక్రియలను వేగవంతం చేసి త్వరగా ఓటరు జాబితాలను రూపొందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదివారం రోజున మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ బిఎల్ఓలు ఫారం 7, 8 దరఖాస్తులను సూపర్‌వైజర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి దరఖాస్తులను పరిశీలించి ఓటరు జాబితాలో నమోదులు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఓటరు తమ ఓటును యాప్ ద్వారా పరిశీలించుకునేలా బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు చైతన్యం చేయాలన్నారు. ఓటరు జాబితాలో ప్రతి ఓటరు తమ పేరు వివరాలు సరి చూసుకోవాలని, ఓటరు జాబితాలో వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లు, ఎస్సీ, ఎస్టీ తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో పన్నులు కట్టిన వారు ఆయా పోలింగ్ స్టేషన్‌లో నమోదు అయ్యారా లేదా అనే వివరాలు సరి చూసి వారికి ఎస్ఎంఎస్ ద్వారా మాచారం అందించాలన్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో గత ఆరు నెలలుగా జరిగిన పెద్ద మొత్తం నగదు లావాదేవీల వివరాలు సేకరించాలని, క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌ల వివరాలు, రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అక్టోబర్ నెల నాటికి 18 ఏండ్లు నిండబోయే వారు, ఇంతకుముందే 18 ఏండ్లు నిండిన విద్యార్థులను ఓటరుగా నమోదు చేసుకునేలా కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అదేవిధంగా ప్రజాస్వామ్యంలో ఓటు విలువను వారికి తెలియజేసి ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు



ఎన్నికల్లో తమ ఓటును విధిగా వినియోగించుకునేలా చూడాలన్నారు. ఓటర్లకు సంబంధించిన ఫోటోలు క్లస్టర్ వారీగా వెంట వెంటనే అప్‌లోడ్ చేయాలని, పేరు ఉన నవ్యక్తుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, బిఎల్ఓల వద్ద సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల వద్ద రెండు నియోజకవర్గాల్లో చాలా వరకు పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి దరఖాస్తు ఫారాలు రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఓ పిడి శ్రీనివాస్, డిడబ్ల్యూఓ బ్రహ్మాజీ, మెదక్, నర్సాపూర్ ఆర్డీఓలు, ఈఆరోలు, ఏఈఆర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల ఈఓ వ్యవహారంతో ఎమ్మెల్యేకు సంబంధం లేదు

**ఈఓ తీరుపై మండిపడ్డ ఛైర్మన్ బాలాగౌడ్**

పాపన్నపేట, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః ఏడుపాయల ఈఓ సార శ్రీనివాస్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిని, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి పేర్లు వాడడాన్ని ఏడుపాయల దేవస్థానం ఛైర్మన్ సాతెల్లి బాలాగౌడ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఏడుపాయల దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడుపాయల ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓ సార శ్రీనివాస్ వైఖరిని తప్పుపడుతూ సస్పెండ్ చేయాలని అధికారులను కోరారు. స్వార్థ ప్రయోజనాల కోసం సొంత నిర్ణయాలు అమలుపరుస్తూ ఆలయానికి చెడ్డపేరు తీసుకువస్తున్నాడని ఆరోపించారు. కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ వ్యవహారంలో ఎమ్మెల్యేకు, ఇఫ్కో డైరెక్టర్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి దేవస్థానం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, తొమ్మిదేళ్ల క్రితం నాలుగు కోట్లు ఉన్న దేవస్థాన ఆదాయం రూ. 9 కోట్లకు పెంచారన్నారు. ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ఏడుపాయల దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. రెండు మూడు



రోజుల్లో దేవాదాయ కమీషనర్‌ను కలిసి సస్పెండ్ ఆదేశాలు ఇవ్వాలని కోరుతామన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సార శ్రీనివాస్ వ్యవహారం ఎట్టి పరిస్థితుల్లో భక్తులపై ఉండదని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏడుపాయల దేవస్థానం అభివృద్ధికి పాలకమండలి పూర్తిగా కట్టుబడి ఉందని, మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మీడియా సమావేశంలో ధర్మకర్తలు మణెమ్మ, సిద్ధిరాములు, వెంకటేశం, మనోహర్, రఘువీర్, నాగభూషణం, మోహన్‌రావు, సాయిలు, పెంటయ్య, చక్రపాణి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### -ఈఓ సార శ్రీనివాస్ స్పందన

తనంటే గిట్టని వాళ్లే నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇదంతా తనను బద్నాం చేసే ప్రయత్నమే అన్నారు. హిందూ దేవాలయాల ప్రతిష్టను దెబ్బతీయవద్దని కోరారు. దేవలయానికి ఎటువంటి కీడు చేయడం లేదని భక్తులకు మీడియా ముఖంగా తెలిపారు.

# శ్రీశైల దేవస్థానంలో సిద్దిపేట నృత్య కళాకారుల ప్రదర్శన



సిద్దిపేట, సెప్టెంబర్ 3,మనం న్యూస్ ప్రతినిధిః ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం దేవస్థానంలో శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా నిర్వహించిన కళా వైభవంలో సిద్దిపేటకు చెందిన శ్రీ భవాని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ గురువు డా. జి. భవాని వారి 28 మంది సభ్యుల శిష్య బృందం కళాప్రదర్శన నిర్వహించారు. కళా వైభవంలో భాగంగా సిద్దిపేట నృత్యకారులు ఓం నమఃశ్శివాయ సూత్రం, అమ్మవారి శృతి, ఐగిరి నందిని, వినాయక కౌతమ్, పుష్పాంజలి, ఘననాయక దశావతారాలు, ముద్దుగారే యశోద, శివశృతి, లింగాష్టకం, గంగాధర శ్రీశైల నాదతోపాటు పేరిని నృత్యం, కూచిపూడి అంశాలపై, పేరిణి శివతాండవం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో డా. గాడిచర్ల భవాని విజయ్ అపర్ణ, హర్షిత, దీపిక, రమ్య, సంధ్య, లిఖిత, సాన్వితశ్రీ, మాన్విత, సాన్విక, ఆరాధ్య, ఆధ్యా, మౌల్యశ్రీ, మధులిక, నందిత, సుకృత, లక్ష్మీ, అనన్య, శ్రీనిధి, శ్రీవల్లి, శ్రీకరి, నిత్య, అభిజ్ఞ, హారిక, నైనిక, సుమేధ, నమస్వి, జితేష్, గాడిచర్ల ధనుష్‌లు పాల్గొన్నారు. వీరి ప్రదర్శనకు మంత్రముగ్ధులైన ఆలయ ఈఓ, ఆస్థాన నాట్య గురువు సాయికృష్ణ సంబంధిత కార్యవర్గ సభ్యులు రవి, మధు, తిరుమలేష్‌లు డా. జి. భవాని శిష్య బృందాన్ని అభినందించారు. అనంతరం వారికి దేవస్థానం సర్టిఫికేట్‌లు, స్వామి వారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.




# రాష్ట్ర ఉపాధిహామీ కౌన్సిల్ సభ్యులుగా శ్రీనివాస్ ముదిరాజ్

### నియామక పత్రాన్ని అందించిన మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట, సెప్టెంబర్ 3,మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు సిద్ధిరబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రోజున రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు శ్రీనివాస్‌కు నియామక పత్రం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ఉపాధిహామీ కమిటీలో సీఎం ఛైర్మన్‌గా ఉండగా ఇందులో ఇద్దరు సభ్యులు ఉంటారు. వీరిలో సిద్దిపేట నుండి శ్రీనివాస్ ముదిరాజ్‌ను కౌన్సిల్ సభ్యులుగా నియమించారు. శ్రీనివాస్ మిట్టపల్లి గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధిలో ఆదర్శంగా నిలిచి జాతీయ స్థాయిలో గ్రామ కీర్తిని నిలబెట్టారు. ఈ మేరకు ఆయన కృషిని గుర్తించి ప్రభుత్వం శ్రీనివాస్ ముదిరాజ్‌కు ఉపాధిహామీ కౌన్సిల్ సభ్యులుగా నియమించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మంత్రి హీష్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ సమర్ధవంతంగా నిర్వహిస్తానన్నారు.

# కాంగ్రెస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు



మొదటి పేజీ తరువాయి..

ప్రాజెక్టును కడతామన్న కేసీఆర్ పదేండ్లు గడుస్తున్న ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అసమర్ధతతోనే గౌరవెల్లి ప్రాజెక్టులో నీళ్ల రావడం లేదన్నారు. సిద్దిపేట జిల్లాలో గౌరవెల్లి ప్రాజెక్టు తర్వాత ప్రారంభించినా మల్లన్నసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసారు కానీ గౌరవెల్లిని పూర్తి చేయడంలో మాత్రం బీఆర్ఎస్ సర్కార్ పూర్తిగా విఫలమయ్యిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ హయంలోనే 80 శాతం పనులు పూర్తి చేసినప్పటికి ఈ పదేండ్లలో గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. యువతకు సకాలంలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఒకసారి అవకాశమివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, అక్కనపేట మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# జిల్లా స్థాయి ఉత్తమ ప్రిన్సిపల్‌గా మిరుదొడ్డి కళాశాల ప్రిన్సిపల్



### ప్రిన్సిపల్ శ్రీనివాస్‌కు అధ్యాపకుల అభినందనలు

మిరుదొడ్డి, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్‌ల పనితీరు ఆధారంగా వెల్లడించిన జాబితాలో మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ చోటు దక్కించుకున్నారు. మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు మంచి ర్యాంకులు సాధించేందుకు ఇటు విద్యార్థులను, అటు అధ్యాపకులను సమాయత్తం చేస్తూ వారిని ప్రోత్సహిస్తూ ఆయన చేసిన కృషికి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను సిద్దిపేట జిల్లా స్థాయి ఉత్తమ ప్రిన్సిపల్‌గా ఎంపిక చేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ శ్రీనివాస్‌కు కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులతో పాటు స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు ప్రభుత్వం తనను జిల్లా స్థాయి ఉత్తమ ప్రిన్సిపల్‌గా గుర్తించడం తనకెంతో సంతోషంగా ఉందని, ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఈ బాధ్యతను సైతం సక్రమంగా నిర్వర్తించి రాష్ట్ర స్థాయిలో మిరుదొడ్డి కళాశాలకు మంచి గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానన్నారు.

# మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

### పెంచిన నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలి

### సిపియం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ హయాంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై పెనుభారం మోపుతుందని, వెంటనే నిత్యావసరాల ధరలు గ్గించాలని సిపియం పార్టీ కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొమురవెల్లి మండలంలోని రామ్‌సాగర్ గ్రామంలో సిపియం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, బీజేపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ నూటికి 90 శాతంగా ఉన్న పేద, మధ్యతరగతి కార్మిక కర్షక వర్గాల ప్రజల అవసరాలను, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి బడా కార్పొరేట్ వ్యక్తులకు దోచిపెడుతుందన్నారు. కార్మికులకు కార్మిక చట్టాల పేరుతో పాత చట్టాలను రద్దు చేసి కొత్తగా నాలుగు లేబర్ కోర్టులను ప్రవేశపెట్టి కార్మికుల పని గంటలు పెంచి కనీస వేతనం అమలు చేయకుండా యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేశారన్నారు. విద్య, వైద్యం ప్రైవేటు పెట్టుబడిదారులకు దగ్గర చేయడం వల్ల పేద, మధ్యతరగతి వారికి విద్య, వైద్యం దూరమైందన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణతో రైతుల బోరుబావులకు మీటర్‌లు బిగించాలని ప్రయత్నిస్తున్నారని, గతంలో తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాల వల్ల రైతులను వ్యవసాయం నుండి



దూరం చేసి వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలోని బడా పెట్టుబడిదారులైన అదాని, అంబానీ వంటి బడా కార్పొరేట్ శకుతలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలంతా ఏకమై మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా పోరాటాలు ఉధృతం చేయాలని, సిపియం పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరు రవిందర్, నాయకులు దాసరి మహేష్, నీల బిక్షపతి, తాడూరు రవి, గణేష్, అనిల్‌కుమార్, ప్రకాష్, చిన్న నర్సయ్య, ఏదుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీని ఓడించడమే మా లక్ష్యం




-తలకాయ కిందికి కాళ్లు మీదికి పెట్టినా జమిలి ఎన్నికలు జరగవు


-మోడీ సర్కార్ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది

-పెట్రో ఉత్పత్తులను జిఎస్టీలోకి ఎందుకు తీసుకురాలేదు

-సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్, సెప్టెంబర్ 3, మనం న్యూస్: బీజేపిని ఓడించడమే ఇండియా కూటమి లక్ష్యమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆదివారం మీడియా సమావేశం సిపిఐ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅ తిథిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో జమిలి ఎన్నికల గురించి వాడి వేడిగా చర్చ జరుగుతుందన్నారు. జమిలి ఎన్నికలు గతంలోనూ జరిగాయని, ఇవేమీ కొత్త కాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2014లోనూ జమిలి ఎన్నికలు జరిగాయన్నారు. 2018లో కేసీఆర్ ముందస్తుకు పోవడంతో జమిలి ఎన్నికలు దూరమయ్యాయన్నారు. జమిలి ఎన్నికల విషయంలో మోడీ సర్కార్ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందన్నారు. రానున్న రెండు మూడు నెలల్లో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనుండగా మిగతా రాష్ట్రాల్లో ముందస్తుకు వస్తేనే జమిలి ఎన్నికలు సాధ్యమవుతాయని తెలిపారు. తలకాయ కిందికి పెట్టి కాళ్లు మీదికి పెట్టినా దేశంలో ఒకేసారి జమిలి ఎన్నికలు జరపడం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ఒకే దేశం, ఒకే నినాదం అంటూ మోడీ ఎవరి చెవుల్లో పువ్వులు పెడుతున్నాడు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రో ఉత్పత్తులను జిఎస్టీ పరిధిలోకి ఎందుకు తీసుకురాలేదని ఆయన దుయ్యబట్టారు. జిఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే పెట్రోల్ ఉత్పత్తుల ధరలు తగ్గే అవకాశం ఉందని ఆయన తెలిపారు. బీజేపి హటావో దేశ్ కో బచావో అనే నినాదంతో దేశంలో 28 రాజకీయ పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడిందన్నారు. 2018లో బీజేపి కేవలం 37.5 శాతం ఓట్లతనే అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రతిపక్షాల ఓట్లు చీలకుండా ఏకమవడం జరిగిందన్నారు. మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాడని ఆయన మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీ ఏకపక్షంగా ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడంతోనే మేము దూరమయ్యామని ఆయన తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తులకు సంబంధించి ఐదు ఎమ్మెల్యే స్థానాలను అడిగామన్నారు. మునుగోడు, కొత్తగూడెం, హుస్నాబాద్, బెల్లంపల్లి, వైరా స్థానాలు ఇస్తేనే పొత్తుకు ఓకే అంటామన్నారు. సీట్ల సర్దుబాటు కుదరకపోతే ఒంటరిగానే పోటీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 17న అనభేరి విగ్రహం నుండి మహమ్మదాపూర్ గుట్టల వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున సిపిఐ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్, నాయకులు, యెడల వనేష్, స్వరూప, కోయ్య కొమురయ్య తదితరులున్నారు.

## కళ్యాణం... కమనీయం



చిన్నకోడూరు, సెప్టెంబర్ 3,మనం న్యూస్: ఎంపిపి మాణిక్యరెడ్డి కూతురు వివాహం సిద్దిపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. వివాహానికి మంత్రి హరీష్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రజాప్రతినిధులు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు.

## రాజీయే.... రాజమార్గం




చిన్నకోడూరు, సెప్టెంబర్ 3,మనం న్యూస్: రాజీయే రాజమార్గమని ఎస్ఐ సుభాష్ గౌడ్ అన్నారు. నేటి నుండి తొమ్మిదవ తేదీ వరకు సిద్దిపేట కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ ఉంటుందన్నారు. గొడవలు వద్దు, రాజీలు ముద్దని, వివాదాలు పెంచుకునే కొద్ది జీవితకాలం కొనసాగుతూనే ఉంటాయన్నారు. కలిసి నిర్ణయం తీసుకున్నప్పుడే సమస్యలు సమసిపోతాయన్నారు. వివాదాలు కావాలా, రాజీలు కావాలో ప్రశ్నించుకోవాలన్నారు. క్షణికావేశంలోనే నేరాలు ఎక్కువ జరుగుతాయని, చేసిన తప్పును ఒప్పుకోవడానికి మించిన ప్రాయశ్చిత్తం లేదన్నారు. కక్షిదారులు క్షమాగుణం కలిగి క్షమిస్తే చాలా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. లోక్ అదాలత్ గురించి తెలియని వారికి తెలిసేలా చేసి కేసుల పట్ల కాంప్రమైజ్ చేసుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు.

# కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కుటుంబ పాలన

-గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే

-బిసి బంధు దళితబంధు బిఆర్ఎస్ నేతలకే ఇచ్చారు

-బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి



హుస్నాబాద్, సెప్టెంబర్ 3, మనం న్యూస్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన నడుస్తుందని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాంధీనగర్ గ్రామంలో పలువురు యువకులు , గ్రామస్తులు బీజేపిలో చేరారు. వారికి ఆయన బీజేపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కేవలం బిఆర్ఎస్ నేతలకు, కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలలో అర్హత ఆధారంగా స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో హుస్నాబాద్ గడ్డపై కాషాయ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు బీజేపి కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షులు చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, కో కన్వీనర్ జనగామ వేణు గోపాల్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి సంపత్ నాయక్, సీనియర్ నాయకులు సంపత్‌రావు, మండల కార్యదర్శి కుమార స్వామి, మండల కార్యదర్శి పోలు శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు సందీప్, శ్రీధర్, గంటల సంపత్, మేదిని రాజ్‌కుమార్, పోలవేణి రవిందర్, పోలవేణి వినయ్, చామంతుల వినేష్, పోలు సునీల్, పండుగ చంద్రం , అన్నవరం శ్రీనివాస్, పెసర సుధాకర్, పేరాల వెంకటేష్, చుంచు సంపత్, నంగునూరు సంపత్ చెంచు కనకయ్య, పండుగ యాదగిరి, గంటల రాజేందర్, పోలు మొండయ్య, గంటల సారయ్య, పోలవేణిరాజు, శివరాత్రి రాకేష్, మైస రాజు, ప్రభాకర్, పోలవేణి రాము, పలువురు మహిళలకు బీజేపి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## వైఎస్ఆర్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి



గజ్వేల్, సెప్టెంబర్ 3,మనం న్యూస్: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి పక్కన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మోనగారి రాజు, సీనియర్ నాయకులు గుంటుకు శ్రీనివాస్ మాటాల్లుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందించిన నేత అని, తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమ పాలన సాగుతుందన్నారు. వైఎస్ఆర్ ఎల్లప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయే నాయకుడన్నారు. రాబోయే ఎన్నికల్లో గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, పట్టణ యువజన అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వహీద్, తిరుపతి, జకీర్, జహంగీర్, హుస్సేన్, మాజీ ఎంపిటిసి, ఆకారం యాదగిరి, అడ్వకేట్ స్వామి, జాకీర్, శివుని ఎల్లం, ఈదుగాని శివులు, జ్వాల స్వామి, శ్యామ్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లోని హుండీలను ఎత్తుకెళ్లిన దుండగులు



## కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

దుబ్బాక, సెప్టెంబర్ 3,మనం న్యూస్: దుబ్బాక పట్టణంలోని శ్రీ బాలాజీ దేవాలయంలో, మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాల్లో శనివారం గుర్తు తెలియని దుండగులు హుండీలను ఎత్తుకెళ్లారు. ధర్మాజీపేట ఎల్లమ్మ దేవాలయ హుండీలో సుమారు వేయి రూపాయలు, దుబ్బాక శ్రీ బాలాజీ దేవాలయంలో సుమారు మూడు వేల విలువ గల హుండీలను దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఎల్లమ్మ దేవాలయ బాధ్యులు, కౌన్సిలర్ బాలకృష్ణ, శ్రీ బాలాజీ దేవస్థాన ఆలయ మేనేజర్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. గటన స్థలాలను పరిశీలించి ఆధారాలను సేకరించామని, త్వరలోనే దుండగులను పట్టుకుంటామని ఎస్ఐ గంగరాజు తెలిపారు.

## మహంకాళి ఆలయానికి లక్ష రూపాయల విరాళం

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మొగుల్ల అంజిరెడ్డి



కొమురవెల్లి, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మహంకాళి ఆలయానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మొగుల్ల రాజిరెడ్డి లక్షల రూపాయల నగదు విరాళంగా ఆలయ కమిటీకి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దుర్గారెడ్డి, యువ నాయకులు బొంగు రాజేందర్‌రెడ్డి, జె. మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్ రెడ్డి, బి. నాగిరెడ్డి, యాదిరెడ్డి, తిరుపతిరెడ్డి, బి. చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, బొంగు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌లోకి భారీగా వలసలు

### పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః జగదేవ్‌పూర్ మండలం బిజి వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెష్ పార్టీ నాయకులు, యువకులు సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎఫ్డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో వారు బిఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎఫ్డిసి ఛైర్మన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున బిఆర్‌ఎస్‌లో చేరేలా చేస్తున్నాయన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఆంధ్రోళ్ల నుండి విముక్తి పొంది అభివృద్ధి చేసుకుంటుంటే కాంగ్రెస్ నాయకులు ఆంధ్రా నాయకులైన షర్మిల, రఘువీరారెడ్డిలాంటి వారిని పార్టీలో కలుపుకొని మరోసారి తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో దళితులను రెచ్చగొట్టి దళితబంధు పథకాన్ని దళితులకు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని విమర్శించారు. కానీ దళితులంతా చైతన్యవంతులన్నారు. కాంగ్రెస్ నాయకులు, ప్రతిపక్షాల నాయకుల మాటలు వినే స్థితిలో ప్రజలు , దళితులు లేరన్నారు. ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున వర్గల్ గ్రామ పరిధిలో పరిశ్రమలు, కంపెనీలు తీసుకువస్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు అడుగడుగునా కంపెనీలు పెట్టకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చాలా చైతన్యవంతులని, తెలివైన వారని,



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అడ్రస్ లేకుండా చేస్తారన్నారు. కాగా నేడు బిఆర్‌ఎస్‌లో చేరిన వారిలో అరిగె భాను, అరిగె యాదగిరి, సురేష్, తుమ్మ స్వామి గౌడ్, రవి గౌడ్, రాజు, పరమేష్, రామిండ్ల సాయిలు, రామిండ్ల రామస్వామి, అరిగె సందీప్, అరిగె బాబుతోపాటు తదితరులు బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బిజి వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ మంజుల రమేష్, ఎంపిటిసిల ఫోరంజిల్లా అధ్యక్షులు కిరణ్ గౌడ్, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ నరేష్, పరమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



చేర్యాల, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః చేర్యాల మండల కేంద్రంలోని పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ పోచంపలిల శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులతో ఆప్యాయంగా మాట్లాడారు. రాష్ట్రంలో మూడవసారి బిఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించబోతుందన్నారు. కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని కోరారు. వారి వెంట చేర్యాల ఎంపిపి ఉల్లంపల్లి కరుణాకర్, బిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ మంగోలు చంటి, ఎంపిటిసిలు మిట్టపల్లి సులోచన శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగుల లక్ష్మినర్సయ్య, బిఆర్ఎస్ మహిళ మాజీ పట్టణ అధ్యక్షురాలు పచ్చిమడ్ల మానస గౌడ్, కో ఆప్షన్ సభ్యులు ఎండి. నాజర్, బిఆర్ఎస్ నేతలు బొమ్మగోని రవిచంద్ర గౌడ్, బొమ్మగోని శ్రీనివాస్ గౌడ్, చంద శ్రీకాంత్, బాచి తదితరులు పాల్గొన్నారు.



## చేర్యాలలో పోలీసుల వాహనాల తనిఖీలు

చేర్యాల, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః చేర్యాల పట్టణ కేంద్రంలో సిఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేని 14 వాహనాలను, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న ఒకరిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి జరిమానా వేశారు. సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత ఆదేశానుసారం ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు.

## సిరిసినగండ్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక



కొండపాక, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు, గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా చెంది కర్ణాకర్, ఉపాధ్యక్షులుగా డిజే నర్సింలు, కార్యదర్శిగా బాబు, సలహాదారుగా ప్రశాంత్, యువజన అధ్యక్షులుగా కనకమల్లు, ఉపాధ్యక్షులుగా వంశీ, కార్యదర్శిగా వేముల నరేష్, సలహాదారులుగా భాను, నరేష్, మైనార్టీ విభాగం అధ్యక్షులుగా సలీమ్, ఉపాధ్యక్షులుగా కలీల్, కార్యదర్శిగా అష్రాఫ్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. సిరిసినగండ్ల మాజీ ఎంపిటిసి నందాల ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు గణపతిరెడ్డి, నర్సింలు, సుధాకర్, ఆరిఫ్, నరేష్, సాయి, విజయ్, భాను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి మతి తప్పి మాట్లాడుతున్న బీజేపి నాయకులు

### బిఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు బైరం శివకుమార్

గజ్వేల్, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః గత తొమ్మిదేళ్ల నుండి బిఆర్ఎస ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిన ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం గజ్వేల్‌లో చేసిన అభివృద్ధి చూసి మతి తప్పి బిజేపి నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు బైరం శివ కుమార్ అన్నారు. బీజేపి పాలిత రాష్ట్రాల్లో మత కలహాలు తప్ప ఇలాంటి అభివృద్ధి ఎక్కడైనా ఉందా, దమ్ముంటే రాబోయే ఎన్నికల్లో బీజేపి నాయకుడు ఎవరో చెప్పాలన్నారు. ప్రజల్లో బలం నిరూపించుకుందామని, రాష్ట్రంలో రెరండు సీట్లు లేని బీజేపి నాయకత్వం మాటలు మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలన్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే వచ్చే ఎన్నికలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. సీఎం కేసీఆర్ ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తూ సమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో బిజేపి అసెంబ్లీ కన్వీనర్ బండారి మహేష్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఒక్క బీజేపి కార్యకర్తలయినా దళితబంధు తీసుకొని దళితబంధు ఇచ్చిన కారులో తిరుగుతు దళితబంధు ఎవరికిచ్చారు అని మాట్లాడడం తగదన్నారు. ఈ



కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు కొడకండ్ల నర్సింలు, గాలంక శ్రీనివాస్, దుబ్బాక యాదదిరి, బండారు భాస్కర్, రాజు , బండారు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు ఎంపిపి కర్ణాకర్ శంకుస్థాపన



చేర్యాల, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః చేర్యాల మండలంలోని పాత దొమ్మాట గ్రామంలో ఎంజిఎస్ఆర్‌జిఎస్ నిధుల కింద మంజూరైన రూ. 10 లక్షల నిధులతో ఆదివారం రోజున ఎంపిపి, ఎంపిటిసి, సర్పంచ్‌లు సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి పుల్లంపల్లి కర్ణాకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రతి ఎంపిటిసికి రూ. 10 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. వీటి ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాండ్ర నవీన్‌రెడ్డి, నాయకులు గూడూరు బాలరాజు, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగుల లక్ష్మి నర్సయ్య, వెలుముల నరసింహులు, మహిళా అధ్యక్షురాలు మంజుల ఒగ్గు రాములు, దుబాల లక్ష్మారెడ్డి, నర్సింలు, వెంకట నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదేళ్లైనా అల్వాల బ్రిడ్జి కట్టలేదు

**-అల్వాల బ్రిడ్జి నిర్మిస్తామని**

**ఫోటోలు దిగిన ఎంపి, ఎమ్మెల్యేలు ఎక్కడ?**

**-ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం ఎందుకు**

**-ముత్యంరెడ్డి ముందుచూపుతోనే వాగ్గడ్డ బ్రిడ్జి నిర్మాణం**

**-కాన్గల్ ధూంధాంలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి**



తొగుట, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః వర్షాకాలంలో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న అల్వాల బ్రిడ్జి నిర్మాణం తెలంగాణ తెచ్చుకొని తొమ్మిదేళ్లు గడిచినా పూర్తి చేయకపోవడం తెలంగాణ ప్రభుత్వ వైఫల్యం కాదా అని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం తొగుట మండలం కాన్గల్ గ్రామంలో నిర్వహించిన ధూంధాం కార్యక్రమంలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షులు బషీరొద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఎంతో అభివృద్ధి చెందిందని గొప్పలు చెప్పుకుంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వం వర్షాకాలంలో కూడవెల్లి వాగు ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తే మిరుదొడ్డి, దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట మండలాలకు చెందిన ప్రజలు సిద్దిపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్య ఎంపి ప్రభాకర్‌రెడ్డికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. కోర్టు కేసు సమస్యను మధ్యవర్తిత్వం చేసి రైతు భాస్కర్‌రెడ్డిని ఒప్పించామని పోటీలు పడి ఫోటోలు దిగిన ఎంపి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావులు మూడేళ్లుగా ఎక్కడికి వెళ్లారని , ప్రజా సమస్యలు పట్టని ఈ ఎంపి, ఎమ్మెల్యేలను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ముత్యంరెడ్డి హయాంలో వెంకట్రావుపేట రోడ్డు గుండా వాగ్గడ్డ వద్ద ఉన్న బ్రిడ్జి వల్ల రోడ్డు దాటడం ఇబ్బందిగా ఉంటే చందాపూర్ రోడ్డు మార్గంలో ఏడాదిలోనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజల సమస్యలు తీర్చిన ఘనత ముత్యంరెడ్డికే దక్కుతుందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో తొగుట మండలం పూర్తిగా వివక్షకు గురైందని, స్వర్గీయ ముత్యంరెడ్డి ఎంతో ముందుచూపుతో తొగుట మండలం ఏర్పాటు చేస్తే నేడు మండలం ఉనికికే ప్రమాదం తెచ్చారని విమర్శించారు. నిరుపేదలు కళ్యాణ మండపంలో వారి బిడ్డల పెళ్లిలు చేయాలంటే ఎంతో ఖర్చవుతుందని గ్రహించి తొగుటలో టిటిడి కళ్యాణ మండపం కట్టిస్తే మల్లన్న సాగర్ ప్రాజెక్టులో పోయిన కళ్యాణ మండపంను ఎందుకు తిరిగి కట్టించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, రెండు లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని, వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలకు గిట్టుబాటు ధరలు పెంచుతామన్నారు. కావున ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపి, బిఆర్ఎస్‌లను ఇంటికి సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాంధారి లతా నరేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, నాయకులు కొండల్‌రెడ్డి, ముదికె స్వామి, భూపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, చెరుకు విజయ్‌రెడ్డి, బి. స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లింగాల కృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి గ్రామ సేవా కమిటీ ఆర్థిక సాయం



తొగుట, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః తొగుట మండలం పెద్దమాసంపల్లి గ్రామానికి చెందిన వడ్డెర బోదాసు శ్రీనివాస్ అకాల మరణం చెందడంతో గ్రామ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పెద్ద మాసంపల్లి గ్రామ సేవా కమిటీ సభ్యులు బృందం మృతుని కుటుంబానికి రూ. 7, 500లు ఆర్థిక సాయంతోపాటు 50 కిలోల బియ్యం అందించడం జరిగిందన్నారు. గ్రామంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సొంత డబ్బులతో తమకు తోచిన విధంగా సాయం చేయాలని నిర్ణయించి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, మానవత్వం మరిచిపోతున్న ఈ రోజుల్లో తోటి వారు కూడా కుటుంబ సభ్యులు అనుకొని సహృదయతతో బాధిత కుటుంబాలకు సహాయం చేస్తూ తమ ఉదారతను చాటుకున్నామని తెలిపారు. ఈ విధంగానైనా బాధిత కుటుంబానికి సహాయం చేసి వాళ్లకు ఆత్మస్థైర్యం, ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సామాజిక సేవతో ముందుకు వెళ్తున్న గ్రామ సేవా కమిటీని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

## దేశం కోసం ధర్మం కోసం పని చేసే పార్టీ బీజేపి

**-బీజేపి జిల్లా కార్యదర్శి,**

**జిన్నారం మండల ఇంచార్జ్ బైండ్ల కుమార్**



జిన్నారం, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః భారత దేశాభివృద్ధి కోసం, ఎంతో కాలంగా వస్తున్న సనాతన ధర్మాన్ని కాపాడడానికి నిరంతరం కృషి చేసే పార్టీ బీజేపి అని జిన్నారం మండల బీజేపి అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో రామాలయంలో పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలోని మట్టిని సేకరించి మేరీ దేశ్ మేరీ మట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బైండ్ల కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బైండ్ల కుమార్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన సందర్భంగా దేశమంతా ఒక్కటే అనే భావనతో దేశ ప్రధాని మోదీ దేశం మొత్తం ఒకే దగ్గర చూడాలనే దృఢ సంకల్పంతో దేశ రాజధానిలో పవిత్ర అమృత వాటికను నిర్మించడానికి దేశంలోని ప్రతి గ్రామం నుండి మట్టి సేకరణ చేయాలని పిలుపునిచ్చారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల దళిత మోర్చ అధ్యక్షులు అన్నారం సాయికిరణ్, మండల కోశాధికారి వీరేష్ చారి, మండల దళిత మోర్చ ప్రధాన కార్యదర్శి కంది ప్రసాద్, కొడకంచి గ్రామ అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు ప్రదీప్ యాదవ్, శ్రీకాంత్, మహేష్, హరీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాస బోనాలకు హాజరైన బిఆర్ఎస్ నాయకులు నీలం మధు ముదిరాజ్

రామచంద్రాపురం, సెప్టెంబర్ 3,మనం న్యూస్ ప్రతినిధిః రామచంద్రాపురంలో శ్రీశ్రీశ్రీ మహంకాళి విశ్వకర్మ మందు మూల శ్రావణమాస బోనాల జాతరను కంజర్ల కృష్ణమూర్తి చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీలం మధు ముదిరాజ్ హాజరై మహంకాళి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మహంకాళి విశ్వకర్మ దేవస్థానం అధ్యక్షులు కృష్ణమూర్తి చారి, ఎన్.ఎం. ర్ యువసేన సభ్యులు, విశ్వకర్మ సంఘం రాష్ట్ర సలహాదారు అధ్యక్షులు కాలప్పాచారి, పోలీస్ వెంకటేష్ చారి, సుదర్శన్‌చారి, రవిచారి, శ్రీనివాస్‌చారి, రాజేందర్‌చారి, రామకృష్ణచారి, హరిచారి, సాయి చారి, ప్రభాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు అండగా సీఎం కేసీఆర్ సహాయ నిధి

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు**



గజ్వేల్, సెప్టెంబర్ 3,మనం న్యూస్ః గజ్వేల్ మండలం సింగాటం గ్రామానికి చెందిన నాంపల్లి రమేష్‌కు రూ. 31, 500, సిద్ధం రాజుకు రూ. 42, 500ల సీఎం సహాయ నిధి మంజూరు కాగా వాటిని ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు, పార్టీ సీనియర్ నాయకులు తాటికొండ మధుసూదన్‌రెడ్డితో కలిసి వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహాయనిధి నిరుపేదలకు ఆర్థిక భరోసాగా సీఎం సహాయనిధి నిలిచిందన్నారు. ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యమని, కుటుంబ పెద్ద కొడుకుగా వ్యవహరిస్తూ కార్పోరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న పేద వారికి దరఖాస్తు చేసుకున్న వెంటనే తన నిధి నుండి విరివిగా డబ్బులు మంజూరు చేస్తున్న విధానమే సీఎం కేసీఆర్ గొప్ప మనసుకు తార్కాణంగా నిలుస్తుందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మి అనేక కార్యక్రమాలు చేపట్టి ఉచిత వైద్యాన్ని తీసుకువచ్చి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వమన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావులకు ఎల్లప్పటికీ రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు తోకల బుచ్చిరెడ్డి, పార్టీ నాయకులు కుంట రాజు, నాంపల్లి కరుణాకర్, బరిగల యాదగిరి, కేసరి ప్రహ్లాద్ గౌడ్, ములుగు కరుణాకర్ పాల్గొన్నారు.

# శ్రావణమాసం పోచమ్మతల్లి బోనాలు

## హాజరైన కాటా సుధా శ్రీనివాస్ గౌడ్

గుమ్మడిదల, సెప్టెంబర్ 3,మనం న్యూస్: శ్రావణమాసం బోనాల పండుగ సందర్భంగా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నర్సింగ్‌రావు, ఎంపిటిసిలు గోవర్ధన్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రేణుక, గ్రామాధ్యక్షులు అంజాద్, మైపాల్‌రెడ్డి, అజర్, మాజీ అధ్యక్షులు వెంకటేష్, పోచయ్య, శంకరయ్య, యాదయ్య, సుధాకర్, రమేష్, భాస్కర్, ప్రేమ్‌కుమార్, నర్సింగ్‌రావు, టి.రాజు, స్వామి, చిన్న, ఎల్. రాజు, బాబు, నవీన్, సందీప్ , బాలు తదితరులు పాల్గొన్నారు.







## వైభవంగా శ్రీశ్రీ మహంకాళి విశ్వకర్మ దేవాలయ శ్రావణ మాస బోనాలు



రాచంద్రాపురం, సెప్టెంబర్ 3,మనం న్యూస్ ప్రతినిధి: శ్రీశ్రీశ్రీ మహంకాళి విశ్వకర్మ మందు మూల శ్రావణమాస బోనాల జాతరను కంజర్ల కృష్ణమూర్తి చారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 112వ డివిజన్ బీజేపి అధ్యక్షులు ఎన్. నర్సింగ్ గౌడ్ హాజరై మహంకాళి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రామచంద్రాపురం పట్టణ ప్రజలకు శ్రావణమాస బోనాల జాతర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆడపడుచులు బోనాలతో అమ్మవారికి బోనం సమర్పించారు. అమ్మ దయ అందరిపై ఉండాలని, సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు బాగా పండాలని, సుఖసంతోషాలతో ప్రజలు జీవించాలని ప్రార్థించారు. దేవస్థానం స్థలం హద్దులో ఇబ్బంది ఉన్నందున సంఘం సభ్యులంతా కలిసి మాట్లాడి ఆలయాన్ని పెద్దగా నిర్మిసత్మారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు కె. కృష్ణమాచారి, విశ్వకర్మ సంఘం రాష్ట్ర సలహాదారు అధ్యక్షులు కాలప్పాచారి, పోలీస్ వెంకటేష్ చారి, రవి చారి, శ్రీనివాస్ చారి, రాజేందర్ చారి, రామకృష్ణ చారి, హరిచారి, సాయిచారి, ప్రభాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# కంట్రీ డిలైట్ మోసాల మాయ

## రోడ్డు పై నుండి చిత్రీకరిస్తున్న జర్నలిస్టుపై దాడి

## కల్తీ పాలు కానప్పుడు భయం ఎందుకు?





పటాన్‌చెరు, సెప్టెంబర్ 3,మనం న్యూస్: పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామ శివారులో ఉన్న కంట్రీ డిలైట్ కల్తీ పాలు, కల్తీ నెయ్యి తయారు చేస్తున్నటువంటివి కొన్ని పత్రికల్లో రావడంతో విషయం తెలుసుకున్న ప్ర ముఖ పత్రికలో పని చేస్తున్న జర్నలిస్టు వెళ్లి వివరాలు తెలుసుకోవడానికి వెళ్లాడు. ఈ మేరకు రోడ్డుపై నుండి వీడియో, ఫోటోలు తీస్తుండగా కంపెనీ హెచ్‌ఆర్, కంపెనీ సిబ్బందితో సహా జర్నలిస్టుపై దాడి చేశారు. కంపెనీ యాజమాన్యం, జర్నలిస్టుపై తను తీసిన ఫోటోలు, వీడియోలు డిలీట్ చేయించి రెండు గంటల పాటు కంపెనీలో బంధించడం జరిగింది. జర్నలిస్టును ఇంకోసారి మరల అటు వైపుగా వచ్చినట్లయితే ఇబ్బంది పెడుతామని బెదిరించారు. ఈ కంపెనీపై ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, కల్తీ పాలు కానప్పుడు భయమెందుకని కంపెనీపై సదరు జర్నలిస్టు మండిపడ్డారు. తక్షణమే కంట్రీ డిలైట్ కంపెనీ యజమాన్యం జర్నలిస్టుకు క్షమాపణలు చెప్పాలని, లేనియెడల జర్నలిస్టు సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.





## నిరంతర వ్యాయామంతో ఆరోగ్యం మెరుగు

### రూ.7 లక్షలతో ఓపెన్ జిమ్

### ప్రారంభించిన టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్



సంగారెడ్డి, సెప్టెంబర్ 3,మనం న్యూస్: ప్రజలు, యువత నిరంతరం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చని టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని 26వ వార్డు మగ్దుంనగర్‌లో కౌన్సిలర్ షేక్ సాబేర్ ఆధ్వర్యంలో రూ. 7 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటున్న వ్యక్తి చంతా ప్రభాకర్ అన్నారు. చింత ప్రభాకర్ కృషితో సంగారెడ్డి పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. వార్డు ప్రజల పూర్తి మద్ధతు చింతా ప్రభాకర్‌కే ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ చింతా ప్రభాకర్ కృషితో సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు కృషితో పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సంగారెడ్డి మున్సిపాలిటీకి రూ. 50 కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరయ్యాయని, వాటితో వార్డుల్లో అత్యవసరాలు గుర్తించి పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

## సమాజ అభివృద్ధిలో జర్నలిస్టులు కీలకం

### జర్నలిస్టు కుటుంబంతో ఎమ్మెల్యే ఆత్మీయ పలకరింపు



దౌల్తాబాద్, సెప్టెంబర్ 3,మనం న్యూస్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ, ప్రజావసరాలను ప్రభుత్వానికి తెలియజేస్తూ సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండలం మహ్మద్ సాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు అబ్బగౌని భాస్కర్ గౌడ్ కుటుంబ సభ్యులను కలిసి వారిని ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సమాజం కోసం నిరంతరం పాటు పడే జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే, వారి మనసు ప్రశాంతంగా ఉన్నపుడే వారి కలం ఎలాంటి ఆటంకం లేకుండా ప్రజాపక్షంగా సాగుతుందన్నారు. జర్నలిస్టులకు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు అండగా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానన్నారు.

# ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

**-హాజరైన ఎమ్మెల్యే రఘునందన్‌రావు**

**-ఆలయానికి సొంతంగా రూ. 50 వేల విరాళం**

దౌల్తాబాద్, సెప్టెంబర్ 3,మనం న్యూస్: దౌల్తాబాద్ మండల పరిధిలోనా మాందాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవాలయంలో నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయానికి తన సొంతంగా రూ. 50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులతో పాడిపంటలు బాగా పండి ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషన్, రామస్వామి గౌడ్, భూపాల్‌రెడ్డి, కుమార్, నరసింహులు, కోనాయిపల్లి సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.







# రాష్ట్ర ఖోఖో జట్టులో పాల్గొన్న గుడికందుల బాలిక

తొగుట, సెప్టెంబర్ 3,మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టులో తొగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన బాలిక పాల్గొని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. గుడికందుల గ్రామ ఉప సర్పంచ్ మల్లుగారి శ్రీకాంత్‌రెడ్డి కూతురు శ్రీనిధి హైదరాబాద్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ఖోఖో మ్యాచ్‌లో పాల్గొనగా తెలంగాణ జట్టు విజయం సాధించింది. సిద్దిపే ట జిల్లా తడకపల్లి విద్యారణ్య ఆవాస విద్యాలయంలో 8వ తరగతి చదువు తున్న శ్రీనిధి  ఖోఖో క్రీడలో ప్రతిభ కనబరిచి జిల్లా నుండి రాష్ట్ర జట్టుకు ఎంపికై తెలంగాణ జట్టు విషయంలో కీలక భూమిక పోషించింది. ఖోఖో ఆటలో ప్రతిభ కనబరిచిన శ్రీనిధిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయు లు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

